క్లుప్తంగా

పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలి



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్: పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.1.61 కోట్లు పన్ను ఉన్నాయన్నారు. ఆ కార్యాలయాలకు నోటీసులు అందజేశామని, వీలైనంత త్వరగా ఉన్నతాధికారులతో మాట్లాడి బడ్జెట్ విడుదల చేయించుకుని పన్నులు చెల్లించాలని కోరామన్నారు. అక్రమ కుళాయి కనెక్షన్లను త్వరితగతిన రెగ్యులర్ చేయించుకోని పక్షంలో కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథరెడ్డి, మున్సిపల్ ఆర్ఐ షఫి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కలసపాడు : కలసపాడు బస్టాండు ఆవరణలోని నిరాశ్రయులు, సాధువులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై చలికి, దోమలకు అవస్థలు పడుతున్న అభాగ్యులకు తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు.

నేడు కిశోరి వికాసంపై శిక్షణ

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. శిక్షణకు మహిళా పోలీసులు, సోషల్ వెల్ఫేర్ సహాయకులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, నోడల్ టీచర్లు, అధ్యాపకులు, ఎన్‌జీవో, వెలుగు, విద్యాశాఖ, వైద్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు శిక్షణలో పాల్గొనాలని తెలిపారు.

చాపాడులో..

చాపాడు : స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30కు మిషన్ శక్తి పథకంలో భాగంగా కిషోర బాలికా వికాస్ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

బీజేపీ అధ్యక్షుడి పరామర్శ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మహబూబ్‌నగర్‌కు చెందిన పల్లెంసెట్టి పండరి కుమార్తె లక్ష్మీదీపిక(13) గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రమణాచారి, షకీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం తహసీల్దార్ గంగయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. పలు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పొటాష్ వాడకం తప్పనిసరి

అట్లూరు : జొన్న పైరుకు యూరియాతోపాటు పొటాష్ ఎరువు తప్పనిసరి అని బద్వేల్ వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండలంలోని తిరువెంగళాపురం రైతు సేవాకేంద్రాన్ని సోమవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తిరువెంగళాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 200 ఎకరాల్లో జొన్న పైరు సాగు చేశారన్నారు. యూరియాతోపాటు పొటాష్ ఎరువు వాడితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివాలయం సమీపంలో కుంటను ఆక్రమించి పునాదులు నిర్మిస్తున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ నాయకులు చిన్ని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాలయం సమీపంలోని కుంటను ఆక్రమించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా, అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఆలయం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్‌బాష పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎనలేని కృషి

వేంపల్లె : ప్రభుత్వం విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఏఎస్‌డబ్ల్యూఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక కడప రోడ్డులోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన దుప్పట్లను సోమవారం అందజేశారు.

కార్తికం.. భక్తిపారవశ్యం

- భక్తులతో శివాలాయాలు కిటకిట
- భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



గోపవరం: బోనాలతో తరలివస్తున్న మహిళలు



ప్రొద్దుటూరు : ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి



ఖాజీపేట : నాగనాథేశ్వరు స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పరమశివునికి ప్రీతికరమైన కార్తిక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాల వద్ద స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు ఆలయాలకు చేరుకుని మహాశివునికి అభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి పరమశివున్ని భక్తిశ్రద్ధలతో పూజించారు. కొంత మంది భక్తులు పలు శైవక్షేతారలకు స్వామివారి దర్శనానికి తరలి వెళ్లారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగానికి, నవరత్నలింగానికి, జలలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు పూజలు చేశారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎవరెస్ట్ ప్రొప్రైటర్ దివంగత మూల ఈశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, రెడ్డి సేవా సంఘం సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరులోని శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాస చివరి సోమవారం పెద్ద ఎత్తున భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. గంగా పార్వతి సమేత భీమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అలానే మున్సిపాలిటీ పరిధిలోని ముక్కంటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

వెదురూరు సంఘమేశ్వరుడి సన్నిధిలో..

చాపాడు : మండల పరిధిలోని వెదురూరులో వెలసిన శ్రీ పార్వతి సమేత సంఘమేశ్వర స్వామి సన్నిధిలో కార్తిక మాస చివరి సోమవారంను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి దేవి, సంఘమేశ్వరుడులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి ఆలయం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

అల్లాడుపల్లెకు పోటెత్తిన భక్తులు

చాపాడు : మండలంలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో కార్తిక మాస చివరి సోమవారం రోజు భక్తులు పోటెత్తారు. చివరి వారం కావటంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వీరభద్ర స్వామి, భద్రకాళీమాత, కేథారీశ్వరుడులను దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే క్షేత్రానికి భక్తుల తాకిడి మొదలైంది. వేలాది మంది భక్తుల నడుమ వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. చాపాడు ఎంపీడీఓ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ రామానుజం స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవాలయాలు

ఖాజీపేట : కార్తిక సోమవారం పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు నాగనాథేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కొండపై భక్తుల ఓంకార నాదంతో మార్మోగింది. ఉదయం నుంచి కొండ పైకి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. కొండ దిగువన మాజీ ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాసులు అన్నదానం నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఖాజీపేట : కార్తిక మాస చివరి సోమవారాన్ని పురస్కరించుకుని నాగనాథేశ్వర స్వామి కొండ దిగువన వృషభాలచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగవరం ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ పోటీల్లో 19 జతల సేద్యపు ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కర్నాటి విశ్వనాథరెడ్డి, రెండవ బముమతి చెన్నకేశవులు, మూడవ బహుమతి చంద్రమోహన్‌రెడ్డి, నాల్గవ బహుమతి తుమ్మల సూర్యనారాయణరెడ్డి, ఐదవ బహుమతి తేజేశ్వర్‌రెడ్డి, ఆరవ బహుమతిని చాగం రెడ్డి సుబ్బారెడ్డిల చెందిన సేద్యపు ఎద్దులు విజయం సాధించాయి. గెలిచిన వారికి ఆలయ కమిటీ అధ్యక్షులు, సీఐ మోహన్ చేతుల మీదుగా బహుమతి అందించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా, ఎండోమెంట్ అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గోపవరంలో సామూహిక బోనాలు

గోపవరం : కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా గోపవరం పంచాయతీ పరిధి లోని ప్రజలు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సామూహిక బోనాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఆలయం వద్దకు చేరుకుని స్వామికి పూజలు జరిపారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతుల ప్రదానం చేశారు.

ఆలయాల్లో పూజలు

కాశినాయన : మండలంలోని ప్రజలు తెల్లవారుజామునే శివాలయాలకు వెళ్లి కార్తిక దీపాలు వెలిగించారు. కనికెలగుండం, అక్కంపేట విభూది శివాలయం, వరికుంట్ల, నరసాపురం, కత్తెరగండ్ల శివాలయాలకు అధిక సంఖ్యల్లో భక్తులు తరలివచ్చారు.

ఆలయాలు కిటకిట

బి.కోడూరు : మండలంలోని నరసింహాపురం సమీపాన తూర్పుకొండలో వెలసిన దప్పిలేశ్వరిదేవి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మేకవారిపల్లె అఖిలాండేశ్వరి బ్రహ్మానంద ఆశ్రమంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.



ఖాజీపేట : నాగనాథేశ్వరుడి దర్శనానికి వేచివున్న భక్తులు



ఖాజీపేట : పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా



ప్రొద్దుటూరు : భోజనం వడ్డిస్తున్న అన్నప్రసాద సేవా సంఘం



చాపాడు: అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి పలకీ సేవ

దత్తత తీసుకోవడం ఒక వరం



మాట్లాడుతున్న వక్తలు

మైదుకూరు : చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకొని మాతృత్వ కోరికను తీర్చుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్త్రీ, శక్తి భవనంలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల సందర్భంగా కిశోర్ వికాసం వంద రోజుల ప్రణాళికపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, సూపర్‌వైజర్ ప్రశాంతి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ విజయకుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తోందని తెలిపారు. పిల్లలు లేనటువంటి దంపతులకు దత్తత కార్యక్రమం ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఈ దత్తత సీఏఆర్ఏ నియమ, నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా జరుగుతుందన్నారు. ఆ వివరాలపై వారు అవగాహన కల్పించారు. మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవలు, బాల్య వివాహాలతో కలిగే పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కమిషనర్ వార్డుల పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున సోమవారం పట్టణంలోనిపలు వార్డుల్లో పర్యటించారు. మోడంపల్లె ప్రాంతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించి అక్కడ జేసీబీ ద్వారా నీటిని తొలగించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోపి రైస్ మి ప్రాంతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించి సిబ్బందిచే శుభ్రం చేయించారు. బుర్రసాధు మఠం ప్రాంతంలో పర్యటించి కాలువల నిర్మాణానికి వెంటనే అంచనాలను తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కుమ్మరికొట్టాలలో నీరు రాత్రి సమయాల్లో సరిగా లేదని కమిషనర్‌కు ప్రజలు ఫిర్యాదు చేశారు. నీటి సరఫరా సమయాలను మార్పు చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ పుస్తకం చదవాలి



రచయిత చంద్రశేఖర్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : అగస్త్యేశ్వరస్వామి ఆలయ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి ఆలయ చరిత్రను తెలుసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్ రావు రచించిన 'శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగస్త్యేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రాచీనమైనదని, మహిమగలదని తెలిపారు. అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు కవులకు పుట్టినిల్లు అని, కళాకారులకు మెట్టినిల్లు అని తెలిపారు. రచయిత ఐఎల్ఎన్ చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ తాను ప్రొద్దుటూరులోనే పుట్టానని, 8వ తరగతి వరకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్నానని పేర్కొన్నారు. 7వేలకు పైగా వ్యాసాలు రాశానని, 34 ఆధ్యాత్మిక పుస్తకాలను వెలువరించానన్నారు. కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ అగస్త్యేశ్వరస్వామి ఆలయం పుస్తకాన్ని తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెలువరించడం ఆనందంగా ఉందన్నారు. రచయిత చంద్రశేఖర్ రావును సత్కరించారు. కార్యక్రమంలో అగస్త్యేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, వంకదార వీరభద్రయ్య, పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని కృష్ణదేవరాయనగర్, త్యాగరాజకాలనీ సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ముందుగా పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామనబోయినమురళి, వైస్‌చైర్మన్ పోకలరమణారెడ్డి, వంకెలపెద్దపోలిరెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని మునయ్య స్వామి తిరుణాల సోమవారం ఘనంగా నిర్వహించారు. తిరుణాలకు వచ్చిన భక్తులకు రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అల్పాహారం వడ్డించారు.

బాలికల హక్కులపై నేడు శిక్షణ

బి.కోడూరు : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఉదయం 9–30 గంటలకు కిశోరి బాలికల హక్కులపై మండల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. బాల్య వివాహాల నివారణ, ఫోక్సో చట్టం, ఆరోగ్యం, యోగా, హ్యూమన్ ట్రాకింగ్, ఆత్మరక్షణ, పరిసరాల పరిశుభ్రత, అక్రమ రవాణా, పౌష్టికాహారం, జీవనోపాధి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

టెంకాయల విక్రయాలకు వేలంపాట

కాశినాయన : మండలంలోని కాశినాయన ఆశ్రమంలో టెంకాయల విక్రయాలకు వేలం పాట నిర్వహించారు. వరికుంట్ల గ్రామానికి చెందిన పి.నారాయణ రెడ్డి రూ.8.60 లక్షలకు దక్కించుకున్నారు. తలనీలాల పాటను రూ.4.05 లక్షలకు కలసపాడుకు చెందిన కె.వెంకట సుబ్బయ్య దక్కించుకున్నారు. 2025 డిసెంబరులో జరిగే కాశినాయన ఆరాధన ఉత్సవాల్ వరకు విక్రయ హక్కు కలిగి ఉంటారు.

27న మండల మీట్

ప్రొద్దుటూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఐదు గ్యాస్ సిలిండర్లు సీజ్

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని మయూరి హోటల్‌లో అక్రమంగా వినియోగిస్తున్న ఐదు వంట గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మలికార్జున మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహ అవసరాలకు వినియోగించాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తుండటంతో దాడులు చేసి 5 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు హోటల్ యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

చాపాడు : ప్రొద్దుటూరులోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం జరుగనున్న పరికరాల పంపిణీ కార్యక్రమ శిబిరానికి మండలంలోని అర్హులైన దివ్యాంగులను తీసుకురావాలని ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. దివ్యాంగులకు వివిధ రకాలైన సహాయ పరికరాలు మంజూరయ్యాయని, ఇప్పటికే జాబితా గ్రామ సచివాలయాల్లో ఉందన్నారు. తమ సచివాలయ పరిధిలో అర్హులైన దివ్యాంగులను పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రొద్దుటూరులో జరిగే పరికరాల పంపిణీ కార్యక్రమానికి తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం



గ్రామోత్సవంలో రామేశ్వరం చౌడేశ్వరిదేవి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను పట్టణంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. భక్తులు జ్యోతిని తలపై ఉంచుకుని నృత్యం చేస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించారు. అమ్మలగన్న అమ్మ శ్రీ చౌడేశ్వరి మాత అందరికి శుభాలు కలిగించమని వేడుకున్నారు. జ్యోతి ఆరకుండా నెయ్యి వేస్తూ పురవీధులలో ఊరేగారు. దారివెంబడి భక్తులు కొబ్బరికాయలు కొట్టి మంగళహారతులు ఇచ్చారు. కొందరు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అన్ని చౌడేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి అమ్మవారి మూలవిరాట్‌ను పూలతో, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించు కునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. జ్యోతి ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పట్టణానికి చేరుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పరిశీలనకు వచ్చిన అనంతపురం జిల్లా రైతులు

ప్రొద్దుటూరు : అనంతపురం జిల్లా గార్లదిన్నె, పామిడి మండలాలకు చెందిన 60 మంది రైతులు రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మండలం కల్లూరు, తాళ్లమాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను సందర్శించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం, ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ రైతు సంఘం, ఏజే బయో రీసోర్సెస్‌సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, అగ్రికల్చర్ ప్రోగ్రాం ఆఫీసర్ రవితేజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ సెంటర్ ప్రతినిధి జయన్న, నేచురల్ ఫార్మింగ్ కోఆర్డినేటర్ నాగవేణి, సీడ్ ప్రొడక్షన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ సునీత, ప్రొద్దుటూరు రైతు సంఘం సీఈఓ పవన్‌కుమార్, ఏజే బయో ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ అభిషేకం రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

కాశినాయన : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిన్నాయపల్లె వాసులు గుర్రాల శ్రీనివాసులు రెడ్డి, అతడి భార్య అరుణ, కుమార్తె పవిత్రల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి పేర్కొన్నారు. చిన్నాయపల్లె గ్రామానికి వెళ్ళి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుడు శ్రీనివాసులురెడ్డి కుమారుడు జగదీష్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని తెలిపారు. అంత్యక్రియలకు రూ.10 వేల నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి నివాళులర్పించి రూ.50 వేల చెక్కును జగదీష్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, గురుబ్రహ్మం, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, టీచర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప గ్రామోత్సం



ఊరేగింపుగా వెళుతున్న హరిహర సుతుడు

ఖాజీపేట : అయ్యప్ప గ్రామోత్సవం ఖాజీపేటలో వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. పుల్లూరు పంచాయతీ పరిధి జాతీయ రహదారి సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయం వద్ద గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అయ్యప్ప స్వామికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వచ్చిన వేలాది భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు. మహిళలు దారి పొడవునా దీపాలతో అయ్యప్ప స్వామి ఊరేగింపులో పాల్గొన్నారు. కేరళ నుంచి తెప్పించిన తబలా నృత్య విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.